ప్రజాశక్తి

సోమవారం 9 జనవరి 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

విద్యారంగం వెనుకబాటుకు

పాలకుల నిర్లక్ష్యమే కారణం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-మార్కాపురం

జిల్లాలో విద్యారంగం వెనకబాటుకు పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు కంకణాల ఆంజనేయులు ఆరోపించారు. మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా 44వ మహాసభ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పాలకులు మారుతున్నారే తప్ప... జిల్లా విద్యా రంగం మాత్రం మారడం లేదన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు పాలకుల విధానాలు కారణంగా మూసి వేయబ డుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదే స్థానంలో ప్రైవేటు విద్యా సంస్థలు విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలు లేని కారణంగా పేద వాళ్లకు విద్య దూరమవుతుందని, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్‌ఎఫ్‌ఐ పోరాటాలు నిర్వహించాలని సూచించారు. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

సిహెచ్. వినోద్

కె. విజయ్

నూతన కమిటీ ఇదే

44వ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభల ముగింపు సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ప్రకాశం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.విజయ్, జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా హేమంత్ (ఒంగోలు), దేవరాజ్ (చీమకుర్తి), జీవన్ (గిద్దలూరు), సహాయ కార్యదర్శులుగా శశాంత్ (ఒంగోలు), కార్తీక్ (మార్కాపురం), జిల్లా కమిటీ సభ్యులుగా వి.వెంకటేష్ (ఒంగోలు), బ్రహ్మాచారి (మార్కాపురం), గణేష్‌రెడ్డి (దోర్నాల), హిదాయతుల్లా (యర్రగొండ పాలెం) మధు (కనిగిరి), కార్తిక్ (గిద్దలూరు), కుమార్ (కోమరోలు) ఎన్నికయ్యారు.

పంట నష్టపరిహారంపై సందిగ్ధం

- రెండు జిల్లాల్లో లక్ష ఎకరాల్లో పంటలకు నష్టం
- ప్రకాశంలో పొగాకు, బాపట్లలో వరికి అపార నష్టం
- ఇన్‌పుట్ సబ్సిడీ కోసం అధికారుల నివేదికలు

నీట మునిగిన వరి ఓదెలు (ఫైల్)

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

మాండోస్ తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లా పరిధిలోని రేపల్లే, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం 70 వేల ఎకరాల్లో వరి పైరుకు తీవ్ర నష్టం వాటిల్లింది.ప్రకాశం జిల్లాలో 67 వేల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. అందులో పొగాకు రైతులు 25 వేల ఎకరాల్లో పంటను నష్టపోయారు. ఎకరాకు సగటున రూ.50 వేల వరకు పంట నష్టం జరిగింది. బాపట్ల జిల్లా రైతులు తుఫానుకు ముందు 30 వేల ఎకరాల్లో వరి పంట కోతలు కోసి ఓదెలపై ఉంచారు. కొద్ది మంది రైతులు మాత్రమే కుప్పలు వేశారు. అధిక భాగం వరి కోసి ఓదెల రూపంలో ఉంది. వర్షాలకు వరి ఓదెలు నీట మునిగాయి. వర్షపు నీరు నిలచిన లోతట్టు భూముల్లో ఓదెలు నీటిపై తేలియాడాయి. మరో 40 వేల ఎకరాల్లో కోతకు వచ్చిన వరి పైరు వర్షం, గాలులకు నేలకొరిగింది. నీరు త్వరితంగా బయటకు వెళ్ళే అవకాశం లేకపోవడంతో పైరు అంతా దెబ్బతింది. దీంతో బాపట్ల జిల్లాలో మొత్తంగా 70 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతింది.

ప్రకాశం జిల్లాలో మొత్తం 25,259 ఎకరాల్లో పంటనష్టం జరిగి 28,559 రైతులు పంటను నష్టపోయినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ఈ మేరకు రూ 25.50 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రభుత్వానికి నివేదిక పంపారు. బాపట్ల జిల్లాలో వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం 75,650 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. అందు వరి పైరుకు 62,883 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. తుది నివేదికల ప్రకారం జిల్లాలో 47,063 ఎకరాల్లో వరికి నష్టం జరిగిందని, అన్ని పంటలకు కలిపి పంటలకు 47 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లి నట్లు తేల్చారు. రెండు జిల్లాల్లోను ప్రాథమిక పంట నష్టం అంచనాలకు తుది నివేదికలకు చాలా వత్యాసం వస్తుంది. వర్షానికి నేలకొరిగిన పంటను నిబంధనలు సాకుగా చూపించి నమోదు చేయలేదని రైతులు ఆరోపిస్తున్నారు. పంటనష్టం అంచనాలకు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన సిబ్బంది పొలంలో నీరు నిలబడ లేదని పంటకు నష్టం వాటిల్లలేదని, పొగాకు, మినుము లాంటి పంటలు ఉరకెత్తలేదన్నట్లు నివేదికలు ఇచ్చారు. దీంతో ప్రాథమిక నష్టం అంచనాలకు తుది నివేదికలకు చాలా తేడా వచ్చింది. పంట నష్ట పరిహారం గురించి రైతులకు ఎలాంటి భరోసా లేకపోయింది. ఇన్‌పుట్ సబ్సిడి అంటూ నివేదికలతో వ్యవసాయశాఖ అధికారులు సరిపెట్టినట్లు తెలుస్తుంది. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు సకాలంలో రైతులకు డబ్బులివ్వాలని, వర్షాలకు దెబ్బతిన్న శనగ, పొగాకు, మిరప, మొక్కజొన్న, మినుము, ఇతర వాణిజ్య పంటలు సాగు చేసిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

బడ్జెట్ అంచనాలు రూ.209 కోట్లు

- ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకునేందుకు విలువైన స్థలాలు ప్రయివేటుకు అప్పగించాలని ప్రతిపాదనలు
- నగరపాలక సంస్థ పాలకవర్గం విచిత్ర వైఖరి
- నేడు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు, పాలకవర్గం విచిత్ర వైఖరి అవలంబిస్తున్నారు. ఓవైపు వందలకోట్ల బడ్జెట్ అంచనాలను ప్రతిపాదిస్తూ మరోవైపు కార్పొరేషన్ ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకునేందుకు కార్పొరేషన్‌కు చెందిన విలువైన స్థలాలను ప్రయివేటు పరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. వందలకోట్ల నిధులు కార్పొరేషన్‌కు వచ్చే అవకాశం ఉంటే విలువైన ఆస్తులను ఎందుకు ప్రయివేటు పరం చేస్తున్నారనే చర్చ సర్వత్రా జరుగుతోంది.

నేడు మూడు సమావేశాలు...

కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాలు నేడు మూడు విధాలుగా జరగనున్నాయి. సాధారణ సమావేశం, అత్యవసర సమావేశం, ప్రత్యేక సమావేశం పేరుతో విటిని నిర్వహించనున్నారు. ఇందులో 2022-23 సవరణ బడ్జెట్, 2023-24కు సంబంధించి వార్షిక బడ్జెట్ అంచనాలు కూడా ప్రవేశ పెట్టనున్నారు.కార్పొరేషన్ వార్షిక బడ్జెట్‌ను రూ.209.23 కోట్లుగా చూపించారు. ఖర్చు రూ.196.89 కోట్లుగా పేర్కొన్నారు. మిగులు నిల్వ రూ.12.34 కోట్లుగా పొందుపరిచారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు, వివిధ ప్రభుత్వ పథకాలు, వివిధ మార్గాల ద్వారా కార్పొరేషన్‌కు రానున్న ఆర్థిక సంవత్సరంలో అంతపెద్ద మొత్తంలో ఆదాయం సమకూరనుందని, అందులోంచి భారీగా అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్ట నున్నామని విశీదికరించారు. డ్రెయిన్‌లు, రోడ్లు, కల్వర్టులు, ట్రాఫిక్ కూడళ్లు, రోడ్ల విస్తరణ లాంటి అభివృద్ధి అంశాలను పొందుపరిచారు. అధికారులు బడ్జెట్ అంచనాలన్నీ అంకెల గారడీగా చూపారని ప్రతిపక్ష సభ్యులు విమర్శిస్తున్నారు. గత ఏడాది బడ్జెట్ అంచనాలకు ప్రస్తుత అంచనాలకు భారీ వ్యత్యాసం ఉండటం అధికార పార్టీ సభ్యుల్లోనూ చర్చనీయాంశంగా మారింది.

పిపిపిలో కార్పొరేషన్ స్థలాలు ప్రయివేటుకు....

అంతపెద్ద మొత్తంలో బడ్జెట్ అంచనాలను చూపించిన అధికారులు మరోవైపు కార్పొరేషన్‌కు ఆదాయం పెంచుకునేందుకు, ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకునేందుకు కార్పొరేషన్‌కు చెందిన ఖాళీ స్థలాలను ప్రభుత్వ ప్రయివేటు పార్టనర్ షిప్(పిపిపి)పద్ధతిలో అప్పగించేందుకు సిద్ధమయ్యారు. అందుకోసం నాలుగు స్థలాలను గుర్తించారు. అందులో పాతమార్కెట్ స్థలం, అద్దంకి బస్టాండ్‌లోని పాత పంజాబ్‌నేషన్ బ్యాంకు స్థలాలు ఉన్నాయి. పాత మార్కెట్‌లో ఆర్గనైజ్‌మాల్, పంజాబ్‌నేషన్ బ్యాంకు స్థలంలో బిగ్‌బాక్స్ రిటైల్ లేదా మిక్స్‌డ్ యూజ్ రిటైల్ పద్ధతిలో కట్టడాలు చేసుకునేందుకు అర్హత కలిగిన సంస్థల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పి)లను కోరుతూ నిర్ణయించాలని కౌన్సిల్ అజెండాలో పెట్టారు. దీన్ని ▸ 2లో

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

నేటి పాలకులు ఉపాధ్యాయుల..

గౌరవాన్ని మంటగలుపుతున్నారు

ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం

ప్రజాశక్తి-పామూరు

ప్రస్తుత పాలకులు ఉపాధ్యాయుల గౌరవాన్ని మంటగలుపుతున్నారని ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం తెలిపారు. సిఎస్‌పురం రోడ్‌లో ఎంపిడిఒ కార్యాలయంగా ఎదురుగా నూతన నిర్మించిన దాచూరి రామిరెడ్డి భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం వి. శ్రీనివాసరాజు అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో విఠపు బాలసుబ్రమణ్యం మాటా డుతూ ఉపాధ్యాయ ఎన్నికలలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ నాయకులను పోటీలో పెట్టడం దుర దృష్టకరమని తెలిపారు. ఉపాధ్యాయులు ఐక్యంగా పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కనిగిరి మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బొట్ల గుండూరుకు చెందిన పారిశ్రామికవేత్త కోటపాటి జనార్ధన్ మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి ఒక్క ఉపాధ్యాయుడికే ఉందన్నారు. అవినీతిని ప్రశ్నించే తత్వం ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. స్వేచ్ఛలేని జీవితం బానిసతత్వంగా మారుతుందని తెలిపారు. దీన్ని ▸ 2లో

మిర్చి రైతు కంట కన్నీరు

ఉరకలెత్తిన పంట.. నష్టాల్లో రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతులకు ఈ ఏడాది అడుగడుగునా కన్నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో కలిపి 23,850 ఎకరాల్లో మిరప తోటలు సాగు చేశారు. ఎకరానికి రూ. 70 వేలు నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టి తోటలను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అయితే ఇటీవల కురిసిన తుపాను మిర్చి రైతులనూ వదల్లేదు. మిరప పొలాల్లోకి నీరు చేరడంతో ఉరకలెత్తాయి. దీంతో కాసిన కాయలు, పూత, పిందె నేలరాలాయి. మొక్కలన్నీ పసుపు రంగులోకి మారాయి. చాలా చోట్ల చనిపోతున్నాయి. ఫలితంగా రైతులకు నష్టాన్ని మిగిల్చింది.

ఐదు వేల ఎకరాల్లో ఉరకలెత్తిన తోటలు..

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని యర్రగొండపాలెం మండలంలో యర్రగొండపాలెం, మురారిపల్లి, మొగుళ్లపల్లి, వీరభద్రాపురం, అయ్యంబొట్లపల్లి, గోళ్లవిడిపి, గంగపాలెం, బోయలపల్లి, అమానుగుడిపాడు, గురిజేపల్లి, పుల్లలచెరువు మండలంలోని పుల్లలచెరువు, మల్లాపాలెం, రాచకొండ, ఉమ్మడివరం, నాయుడుపాలెం, కవలకుంట్ల, ముటుకుల, మర్రివేముల, త్రిపురాంతకం మండలంలోని రాజుపాలెం, వెల్లంపల్లి, దూపాడు, విశ్వనాథపురం, సోమేపల్లి, త్రిపురాంతకం, గణపవరం, మేడపి, ఒడ్డుపాలెం, పెద్దారవీడు మండలంలోని పెద్దారవీడు, దేవరాజుగట్టు, తోకపల్లి, గొబ్బూరు, పుచ్చకాయలపల్లి, రాజంపల్లి, పెద్దదోర్నాల మండలంలోని పెద్దదోర్నాల, చిన్న దోర్నాల, జెమ్మి దోర్నాల, బొమ్మలాపురం, కటకానివారిపల్లి తదితర గ్రామాల్లో సాగు చేసిన సుమారు

దెబ్బతిన్న మిర్చి పంట

8 వేల ఎకరాల్లో మిరప తోటలు ఉరకలెత్తాయి. తోటలకు తెగులు ఆశించి మొక్కలు ఎండిపోతున్నాయి. రైతులు భారానికి మించి పెట్టుబడులు పెట్టారు. అయినా ఆశ చావక రసాయనిక పురుగు మందులు, రసాయన ఎరువులు వాడుతున్నారు. అయినా మార్పు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వర్షం అనంతరం పలు రకాల తెగుళ్లు విజంభించడంతో దిగుబడులకు శరాఘాతంగా మారాయి.

తొలి కోతతోనే తోటను వదిలేశా

బోయలపల్లి దాసు, రైతు, ఒడ్డుపాలెం, త్రిపురాంతకం మండలం

మూడు ఎకరాల్లో మిరప చేశాను. కాపుకు వచ్చేసరికి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు నిల్వ చేరడంతో తెగుళ్లు చుట్టుముట్టాయి. తేమ శాతం అధికమవడంతో ఇటుక రాయి తెగులు ఆశించి పంట అంతా ఎండిపోయింది. రూ. మూడు లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం చెట్లకు ఉన్న అరకొర కాయలు కోసి తోటను వదిలేశాను.

తుఫాను కొంప ముంచింది

కైపు బ్రహ్మారెడ్డి, రైతు, మురారిపల్లి, యర్రగొండపాలెం మండలం

మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. పెట్టుబడులు పూర్తయి ముమ్మరంగా కాపు దశకు వచ్చిన వేళ తుపానుతో నీరు నిల్వ చేరి ఉరకలెత్తడంతో పంట నిలువునా ఎండి పోతోంది. ఇటీవల కోత కోయగా ఆరు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట దెబ్బతినడంతో కోతలు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే రూ. 2.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

మిర్చి రైతులకు నష్ట పరిహారం అందించాలి

గాలి వెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

తుఫాను ప్రభావంతో నష్టపోయిన మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మిర్చి రైతులు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తోటలను సాగు చేశారు. కురిసిన తుఫానుతో వేలాది ఎకరాల్లో తోటలు నీట మునగడంతో పాటు ఉరకలెత్తాయి. దిడుబడి వచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడులు కూడా తీరవు. ప్రభుత్వం పారదర్శకంగా సర్వే నిర్వహించి మిర్చి రైతులకు నష్టపరిహారం అందించాలి.

బడ్జెట్ అంచనాలు రూ.209 కోట్లు

(మొదటి పేజీతరువాయి)

ఆమోదిస్తే ఆరెండు స్థలాల్లో పిపిపి పద్ధతిలో ఏదైనా సంస్థలు భారీ మాల్స్ కట్టుకున్నారు. 25 ఏళ్లపాటు వారి ఆధీనంలో ఉంచుకుంటారు. ఇందుకు గాను కార్పొ రేషన్‌కు నామమాత్రపు ఫీజులు చెల్లిస్తారు. 25 సంవత్సరాల తరువాత కార్పొరేషన్‌కు కట్టడాలను అప్పగిస్తారు. దీనిపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేషన్ వద్ద పెద్దమొత్తంలో నిధుల లభ్యత ఉన్నట్లు బడ్జెట్ అంచనాలలో చూపినందున కార్పొరేషన్ ద్వారానే ఆయా స్థలాలను అభివృద్ధి చేసి షాపులను కట్టి అద్దెలకు ఇస్తే కార్పొరేషన్‌కు భారీగా ఆదాయం వస్తుంది కదా..? ప్రయివేటు సంస్థలకు అప్పగించడం ఎందుకని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. దీనిపై సభ్యులు ఎలా స్పందిస్తారనే చర్చ జరుగుతోంది. మరోవైపు నెల్లూరు బస్టాండ్‌లోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో గతంలో ఐడిఎస్‌ఎంటి నిధులతో నిర్మించి మధ్యలో ఆగిపోయిన నిర్మాణాలను పూర్తిచేసేందుకు రూ.40 లక్షలు ఖర్చు అవుతోందని, దాన్ని కార్పొరేషన్ నిధులతో పూర్తి చేయాలా..?లేక పిపిపి పద్దతిలో రిక్వస్ట్ ఫర్ ప్రపోజల్స్ ఆహ్వానించాలా..!అనే అంశాన్ని అజెండాలో పొందుపరిచారు. కేవలం రూ.40 లక్షల నిధులతో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తిచేసి షాపులను అద్దెలకిచ్చి కార్పొరేషన్‌కు ఆదాయం పెంచాల్సిన అధికారులు, పాలకవర్గం, దాన్ని కూడా పిపిపిలో అప్పగించాలనే ప్రతిపాదన తీసుకు రావడం విశేషం.

గోపాలనగర్ హిందూ స్మశాన వాటికలో వివిధ సామాజిక వర్గాల వారు ఆరామక్షేత్రాలు నిర్మించుకునే స్థలాలను కేటాయించే విషయాన్ని కౌన్సిల్ అజెండాలో పెట్టారు. అయితే ఇందులో ఓ సామాజిక వర్గానికి చెందిన వారి ఆరామ క్షేత్రానికి ఎక్కువ స్థలం కేటాయించే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటి (ఒడా) నిధులతో సమైఖ్యతనగర్ కమ్యూనిటీ హాలు నిర్మాణం, గ్రీనరీ అభివృద్ధి, ఒకటో సమ్మర్ స్టోరేజీట్యాంకుపై వాకర్స్‌ట్రాక్ ఏర్పాటు చేయాలనే విషయాలను అజెండాలో పెట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రతిపాదించిన పలు పనులు, గుత్తికొండవారిపాలెం వద్ద డంపింగ్‌యార్డు స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించే విషయం, అదే ప్రాంతంలో నిర్మించిన సివేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి పెరిగిన అంచనాలను కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి సమకూర్చే విషయం కూడా అజెండాలో పెట్టారు. ఈ అంశాలపై సభ్యులు సమావేశంలో చర్చ చేయనున్నట్లు సమాచారం.

నేటి పాలకులు ఉపాధ్యాయుల గౌరవాన్ని మంటగలుపుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

అందరూ వ్యతిరేకించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ పోరాటాల ద్వారా హక్కులు సాధించు కున్నామన్నారు. తొలుత యుటిఎఫ్ జెండాను వెంకటసుబ్బయ్య, తిరుపతిరెడ్డి, బ్రహ్మం ఆవిష్కరించారు. దాచూరి రామిరెడ్డి భవనాన్ని కోటపాటి జనార్ధన్ ి ప్రారంభించారు. కంప్యూటర్ రూమును వితపు బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వీరారెడ్డి, రవి, రామచంద్రారెడ్డి, కోటిరెడ్డి, రామారావు, ఉమామహేశ్వరి, లక్ష్మి, నాగ సులోచన, రజియాబేగం, నరసింహారావు, సత్యనారాయణ, యు. మాల కొండారెడ్డి, గల్లా చెన్నయ్య, రత్తయ్య, అంజలీదేవి, ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఖాజారహంతుల్లా, రాము, వీరాంజనేయులు, కొండయ్య, రుషేంద్ర, ఉదయ్, కావిటి నాగేశ్వరరావు, వేణుగోపాల్, ఏసుబాబు, ఎస్‌టియు నాయకుడు వెంగళరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్య.కా.సం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పామూరు

మండల పరిధిలోని డివిపాలెంలో వ్యవసాయ కార్మిక సంఘం కేలండర్‌ను మహిళా కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించినట్లు వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఏటా వీరనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్తమ్మ, జెబీనా, మస్తాన్‌బీ, సుల్తాన్‌బి, రమణమ్మ పాల్గొన్నారు.

విజయోత్సాహంలో ప్రకాశం కబడ్డీ జట్టు

కబడ్డీ టోర్నీ విజేత ప్రకాశం

ప్రజాశక్తి-మేదరమెట్ల: గత మూడు రోజుల నుంచి కొరిశపాడు మండలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య శ్రీ భ్రమరా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఈ పోటీలలో జరిగిన ఆటలో ప్రకాశం బుల్డ్ జట్టు విజేతగా నిలిచింది. ప్రకాశం జట్టు లక్ష రూపాయలు, రెండో ప్రైజ్ రంగారెడ్డి జిల్లాకు చెందిన జట్టు 75,000, వెస్ట్ గోదావరి జట్టు 50,000, కష్ణా జిల్లా జట్టు 25,000 ప్రైజ్ మనీని గెలుచుకున్నాయి. ఈ ప్రైజ్ మనీ బహుమతులు అన్ని స్థానిక వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య, మాజీ శాసనసభ్యులు బాసిన చెంచు గరటయ్య, శ్రీ భ్రమరా వెంచర్ ఎండి అయిన జి రామచంద్రరావు చేతుల మీదగా ప్రదానం చేశారు. మొదటి బహుమతి కోసం జరిగిన ప్రకాశం, రంగారెడ్డి జిల్లా జట్ల మధ్య పోటీ హెూరాహెూరీగా నరాలు తెగే ఉత్కంఠతతో సాగింది. సమానమైన స్కోర్లతో ముందుకు వచ్చి చివరలో ప్రకాశం జట్టు త్వరగా పాయింట్లు సంపాదించుకోవడం వల్ల 12 పాయింట్లతో రంగారెడ్డి జిల్లాపై విజయం సాధించింది. అంతకముందు మూడు, నాలుగు బహుమతుల కోసం జరిగిన వెస్ట్ గోదావరి, కృష్ణ జట్ల మధ్య జరిగిన పోటీలో వెస్ట్ గోదావరి విజయం సాధించింది. అయితే ఈ ఫైనల్ మ్యాచ్‌లు తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి క్రీడాభిమానులు తండోప తండాలుగా తరలిరావడం విశేషం.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య

పూత రాలిపోయిన కంది పంట

తుఫానుకు 'కంది'పోయే

పూత రాలిన వైనం ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇటీవల వల మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు యర్రగొండ పాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో కంది పైరు తీవ్రంగా దెబ్బతింది. ఈ ఏడాది 28,800 ఎకరాల్లో రైతులు కంది పంటను సాగు చేశారు. కాని మాండస్ తుఫాన్ దాటికి వరుసగా ఎడతెరిపి లేకుండా వారం రోజులు పాటు వర్షాలు కురవడంతో సాగులో ఉన్న కంది పైరుకి తీవ్ర నష్టం జరిగింది. పూత, పిందె దశలో ఉన్నప్పుడు వరుస వర్షాలకు పూతరాలి పోయింది. దీంతో కందిలో సూమారు 50 శాతానికి పైగా దిగుబడులు తగ్గనున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.

పెట్టుబడులు కష్టమే..

ఈ ఏడాది కంది పైరకు ఖర్చులు అధికంగా అయ్యాయి. సేద్యం, విత్తనాలు, పురుగు మందులు ఎరువులకు రైతులు రూ.10 నుంచి రూ. 20 వేలు వరకు ఖర్చు పెట్టారు. భూమి లేని కొందరు రైతులు వేరే వాళ్ల భూములు ఎకరాకు రూ. 5 నుంచి రూ. 10 వేలు చొప్పున కౌలు చెల్లించి దిగుబడులు సాగు చేశారు. ప్రస్తుతం దిగుబడులు తగ్గడంతో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. అధికారులు నష్టపోయిన కంది పంటను పరిగణలోకి తీసుకొని నష్టపోయిన కంది రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

గంజాయి వ్యాపారులు అరెస్టు

- తీగలాగితే కదిలిన డొంక
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

యువతను గంజాయి మత్తులో ముంచుతూ కోట్లు గడించే ఘరానా అక్రమ గంజాయి వ్యాపారులను బాపట్ల రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గంజాయి విక్రయాలపై బాపట్ల మండలం చెరువు జమ్ముల పాలెంలో తీగ లాగితే చిన్నగంజాం మండలం మోటుపల్లి రుద్రమాంబపురం గ్రామంలో గంజాయి డొంక కదిలింది. గంజాయి విక్రయిస్తూ రాజకీయాల్లో చలామణి అవుతున్న పలువురిని అరెస్టు చేసిన పోలీసులు ఆదివారం బాపట్ల డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. దొంగచాటుగా బాపట్ల, చిన్నగంజాం మండలాల్లో గంజాయి అమ్ముతున్న వారిని అదుపులోకి తీసుకున్నవారి వివరాలను బాపట్ల డిఎస్‌పి ఏ శ్రీనివాసరావు విలేకరులకు వివరించారు. గంజాయి అమ్ముతూ పట్టుబడిన బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన గండికోట వెంకటేషును అరెస్ట్ చేసిన పోలీసులు అతని ద్వారా గంజాయి విక్రయిస్తున్నవారి వివరాలను రాబట్టారు. చిన్నగంజాం మండలం మోటుపల్లి రుద్రమాంబపురం గ్రామానికి చెందిన కొండూరి సోమయ్య, కొండూరి గోవిందు, బాపట్ల మండలం స్టువర్టుపురం గ్రామానికి చెందిన అంగడి చంద్రబాబులను శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు డిఎస్‌పి వివరించారు. వీరి నుంచి 14 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం (మోటార్ సైకిల్) స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పి ఏ శ్రీనివాసరావు పర్యవేక్షణలో బాపట్ల రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐ వెంకటప్రసాద్ తమ సిబ్బందితో నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. రహస్యంగా గంజాయి అమ్మకాలు నిర్వహిస్తున్న వారిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న హెడ్ కానిస్టేబుల్ ఎంవి రామరాజు, కానిస్టేబుళ్లు వి శ్రీనివాసరావు, ఎన్ వేణుబాబు, టి వెంకటేశ్వరరెడ్డిలను డిఎస్పి అభినందించారు. సమావేశంలో బాపట్ల పట్టణ సీఐ కృష్ణయ్య, రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్ఐలు వెంకటప్రసాద్, పున్నారావు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

కారు ఢీకొని ద్విచక్రదారుడు మృతి

ప్రజాశక్తి-చీరాల

మృతి చెందిన అజయ్ బాబు

కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చీరాల ఒంగోలు జాతీయ రహదారిలోని అక్కయ్య పాలెం పంచాయతీ ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు నుంచి చీరాల వైపునకు వెళుతున్న ఎపి39ఎల్ఎన్ 2255 నంబరుగల ఇన్నోవా కారు, ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఆమోదగిరి పట్టణానికి చెందిన ఎడ్లూరి అజయ్ బాబును(30) ఢీ కొట్టింది. అయితే ఈ ఘటనలో అజయ్ బాబుకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్ఐ జి సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు వేటపాలెం ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ద్విచక్ర వాహనదారుడు అక్కయ్యపాలెం నుంచి జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

అక్రమ లేఔట్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

ఎన్‌హెచ్16 పక్కన అక్రమ లేఅవుట్లు

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామానికి ఎదురుగా ఉన్న ఎన్‌హెచ్ 216 జాతీయ రహదారి పక్కన ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ లేఔట్లు వేశారని పంచాయతీ కార్యదర్శి మోడీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కర్లపాలెం మండలం మేజర్ పంచాయతీలోని పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అక్రమ లే అవుట్ వేశారని ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియపరిచినట్లు పేర్కొన్నారు. శనివారం జిల్లా పంచాయతీ అధికారి వైఎస్ నాయక్ పరిశీలించి ఎటువంటి అనుమతులు లేవని నిర్ధారించారు. ఈ లేఔట్ 2010లో వేశారు. పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు వేయడం నేరమని పేర్కొన్నారు. అలా లేఅవుట్లు వేస్తే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అందుకోసం ఆదివారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఒ శరత్ బాబు, ఎంపిడిఒ ఎలీషాబాబు, కర్లపాలెం వీఆర్వో చంద్రశేఖర్ ఉన్నారు.

హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు

అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

పని ఒత్తిడే కారణం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

పెరిగిన పని భారం, అధికారులు, రాజకీయ నాయకుల ఒత్తిడిని తాళలేక అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సేకరించిన వివరాల ప్రకారం.. మండలంలోని సురేపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో నీలా కవిత అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. కాగా ఇటీవల రబీ సీజన్ కోసం రైతు భరోసా కేంద్రానికి ఎరువులు రాగా వాటిని గోడౌన్‌లో ఉంచారు. అయితే ఈ గోడౌన్‌లో కొన్ని బస్తాల ఎరువులు మాయమయ్యాయి. దీంతో గోడౌన్ చూస్తున్న విఏఏ, స్థానిక నాయకులు, అధికారుల మధ్య స్పర్థ ఏర్పడింది. దీంతో మనస్థాపానికి గురైనా కవిత శుక్రవారం ఆర్‌బికెలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. దీంతో కవితను వైద్య చికిత్స నిమిత్తం చేరుకుపల్లి వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా కవిత పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు సహచర ఉద్యోగులు తెలిపారు. జరిగిన పరిస్థితి దృష్ట్యా రాజీ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ముఖ్యంగా ఆ శాఖలో పని చేస్తున్న అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవటం వలననే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

రైతు భరోసా కేంద్రం

జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి-మేదరమెట్ల

మండలంలోని రాచపూడి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను కొరిశపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు తన సిబ్బందితో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,100 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎన్ఎన్‌సి అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస్

పోటీ పరీక్షల పుస్తకాలు సమకూరుస్తాం

గ్రంథపాలకురాలు డి ధనమ్మ

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు గ్రంథపాలకురాలు ధనమ్మ అన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఉత్తర్వుల ఉత్తర్వుల మేరకు చీరాల పట్టణ పరిధిలోని శాఖ గ్రంథాలయంలో రీడర్స్ ఆన్ డిమాండ్ రిజిష్టరులో చదువరులు నమోదు చేసిన పోటీ పరీక్షలు, రిఫరెన్స్, పాఠ్య పుస్తకాలు తెప్పించే కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చదవటం మాకిష్టం అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ముంతా వారి కూడలిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని పోటీ పరీక్షలు జరుగుచున్నందు వలన ఉద్యోగార్థులు సత్వరమే స్పందించి అవసరమైన పుస్తకాలను నమోదు చేసుకోవచ్చునని సూచించారు. అనంతరం ఎన్ఎన్‌సి అకాడమీ డైరెక్టర్ యర్రాకుల శ్రీనివాస్ యాదవ్ పోటీ పరీక్షలకు అవసరమైన అభ్యసన సామగ్రిని పాఠకుల కోసం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరాల హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు పవని భాను చంద్రమూర్తి, ప్రభాకరరావు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న యువతీ యువకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనసేన జిల్లా అధికార ప్రతినిధి భీమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. యర్రగొండపాలెంలోని మంజూనాథ ఫంక్షన్ హాలులో జనసేన నియోజకవర్గ కార్యకర్తల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు కిష్టఫర్, పెద్ద పండు, అచ్చయ్య, రామాంజనేయులు, తోటా బాలు మాట్లాడారు. కార్యకర్తలంతా సైనికుల్లా మారి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు అండగా నిలవాలని సూచించారు. ఈ సమావేశంలో ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు

- ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన
- న్యాయం చేయాలని బాధితుల వేడికోలు

ప్రజాశక్తి-కొత్తపట్నం

తమకు కేటాయించిన ఇంటి స్థలంలో ఇల్లు నిర్మించుకుంటుంటే కొంతమంది ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటూ, తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధిత కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. తమకు న్యాయం చేయాలని వేడుకుంటోంది. ఈ సంఘటన రంగాయపాలెంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. రంగాయపాలెం గ్రామానికి చెందిన నిమ్మల కుమారస్వామి సతీమణి పావని పేరుతో సర్వే నెంబర్ 829లో రెండున్నర సెంటు భూమిని గత టిడిపి ప్రభుత్వం హయాంలో నవంబర్ 14, 2018న మండల తహశీల్దారు ఇంటి నివేశన స్థల పట్టాను నిమ్మల పావని పేరుతో మంజూరు చేశారు. అయితే ఆ స్థలానికి ముందు రచ్చబండను అనధికారికంగా నిర్మించారు. ఇచ్చిన పట్టాలో పడమర సిమెంట్ రోడ్డు ఉందని, రచ్చబండ ఏ విధంగా నిర్మిస్తారని బాధితులు ప్రశ్నించారు. రచ్చబండ కూలిపోవడంతో తమ స్థలంలో గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇంటి నిర్మాణాన్ని చేపట్టామని, బేస్మెంట్ లెవల్ కూడా పూర్తి అయ్యిందని పేర్కొన్నారు. బేస్మెంట్ రూ.35,000 నగదు, 40 సిమెంట్ బస్తాలు, ఐరన్ కూడా ఇచ్చారన్నారు. తిరిగి దానిపై పని చేసుకుంటుండగా తమ బంధువులకు చెందిన వారే ఇక్కడ రచ్చబండ ఉందని, ఇల్లు నిర్మించడానికి వీలు లేదని, రెండు అడుగులు ముందుకు జరిగావంటూ తమ పనికి ఆటంకాన్ని కలిగిస్తున్నారని వారు వాపోయారు. దీనిపై మండల తహశీల్దారుకు ఫిర్యాదు ఇవ్వగా నాలుగు రోజుల క్రితం తహశీల్దారు బివి రమణరావు, వీఆర్వో బాబురావు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి, బేస్‌మెంట్ నుంచి పడమరకు ముందుకు ఇక జరగవద్దని, ఎలాంటి అడ్డు రాకూడదని గ్రామస్తులకు నచ్చచెప్పినట్టు సమాచారం. అయితే ఇంటి పని చేస్తుండగా కొంతమంది బలవంతంగా గోడలను పగలగొట్టి, సిమెంటును ఇసుకపాలు చేశారని వాపోయారు. ఏం చేయాలో తోచక, ఎవరి సహాయం తమకు లేకపోవడంతో, పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. ఇప్పటికైనా తహశీల్దారు, ఎస్ఐ, గ్రామ సర్పంచ్, జోక్యం కలుగజేసుకొని తమ ఇంటిని యథాప్రకారం నిర్మించుకునే విధంగా చూడాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తాము నిర్మించుకుంటున్న ఇంటి వద్ద బాధిత కుటుంబం

నియామక పత్రాలు అందజేస్తున్న బిసి సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూరగాని లక్ష్మి

బీసీలకు అండగా బీసీ సేన: సూరగాని లక్ష్మి

ప్రజాశక్తి-చీరాల

బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం బిసి సేన అన్నివేళలా అండగా ఉంటుందని బిసి సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూరగాని లక్ష్మి అన్నారు. ఏపీ బీసీ సేన గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం అరండల్ పేటలోని విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు సొంటి నాగరాజు, మహిళ అధ్యక్షురాలు సూరగాని లక్ష్మి మాట్లాడాతూ బీసీలు అందరూ ఐక్యమత్యంగా ఉండి ఏకతాటిపై నిలబడి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని అన్నారు. బిసి సేన బలోపేతానికి అందరూ కృషి చేయాలని తద్వారా బిసిలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం సత్వరమే జరుగుతుందని అన్నారు. జిల్లా అధ్యక్షులు గోలి నాగకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలోని పలువురికి బిసి సేనలో కీలక పదవులను వారి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాలపాటి కృష్ణవేణి, రాష్ట్ర నాయకులు కుంచాల కిషోర్ ఎం ఆంజనేయులు, శ్రీనివాసరావు, వి రాము, మణికంఠ, పి రంగనాథ్, ప్రతాప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల జిల్లా ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక బాపట్ల ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాప్టో బాపట్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా బడుగు శ్రీనివాస్, టీవీ సురేష్ ఎన్నికయ్యారు. కో చైర్మన్లుగా ఎన్ సురేష్ బాబు, షేక్ ఘన్ సైదా రూట, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా జే వినయ్ కుమార్, సోషలిజం, డి ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులుగా ఏ శ్రీనివాసరావు, గుడివాడ అమరనాథ్, ఏ శేఖర్ బాబు, వెంకటేశ్వర్లు, ఇమాముద్దీన్ ఖాదిరి రూట, కె పిచ్చయ్య, డి ప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఫ్యాప్టో కోశాధికారి చింతల సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి సరిగా లేదన్నారు. మూడున్నర సంవత్సరాలు గడిచినా ఒక్క డీఏ కూడా ప్రకటించలేదన్నారు. ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ డబ్బులు 11 నెలలుగా చెల్లించలేదన్నారు. సిపిఎస్ రద్దు చేయలేదని విమర్శించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎక్కువ జీతాలు తీసుకుంటున్నారని కొందరు శాసనసభ్యులు కామెంట్ చేయడాన్ని ఫ్యాప్టో జిల్లా సంఘం తీవ్రంగా ఖండించింది.

ప్రదర్శనలిస్తున్న కళాకారులు

అలరించిన సర్వరాగ సమ్మోహనం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

శారదా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, రోటరీ క్లబ్ బాపట్ల సంయుక్తంగా నిర్వహించిన సర్వరాగ సమ్మోహనం 190 కార్యక్రమం రోటరీ ఆడిటోరియంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సభలో విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పివి రామకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటి ప్రగతి, రోటరీక్లబ్ అధ్యక్షుడు సుధీర్ పాల్గొన్నారు. ప్రఖ్యాత సినీ, టీవీ సంగీత కళాకారులు మాడభూషి సౌజన్య, విద్యా భారతిలు చేసిన స్వర విన్యాసం ఆహూతులను ఆకట్టుకున్నది. హంసధ్వని రాగంలో అన్నమయ్య కీర్తనతో ప్రారంభించి, దేశి, కళ్యాణి, మోహన, హిందోళ సురట రాగాలతో స్వరపరిచిన సినీ లలిత గీతాలను మేడ్లీ చేసి ఓ నూతన ప్రయోగాన్ని ఆవిష్కరించారు. సంగీత కార్యక్రమాన్ని ప్రముఖ టీవీ కళాకారిణి భావన సమన్వయ పరిచారు. ఈ కార్యక్రమంలో శారదా ఫైనాన్స్ వ్యవస్థాపకులు సభ్యులు శ్రీకాంత్, పిల్లుట్ల అన్నపూర్ణ, ఏలూరి హరిబాబు, రోటరీ కార్యదర్శి రాంబాబు, రోటరీ సభ్యులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

అధికారుల సంక్రాంతి సంబరాలు

అలరించిన తెలుగు పండగ సాంప్రదాయాలు

ప్రజాశక్తి-చీరాల, యద్దనపూడి

తెలుగు పండుగ సాంప్రదాయాలను గౌరవిస్తూ అధికారులందరూ ఐక్యతను చాటుతూ జరుపుకుంటున్న సంక్రాంతి సంబరాలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నాయని ఎంపీడీవో కృష్ణకుమారి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కార్యాలయ ఆవరణంలో వివిధ శాఖల మండల స్థాయి రెవెన్యూ అధికార సిబ్బందితో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి సాంబశివరావు, ఎంపీడీవో కృష్ణకుమారి మాట్లాడుతూ విధి నిర్వహణ పని ఒత్తిళ్లలో మానసిక ప్రశాంతత కోసం నిర్వహిస్తున్న తెలుగు పండుగ సాంప్రదాయాలలో అధికారులు అందరూ ఉత్సాహంగా పాల్గొనటం అభినందనీయమని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా అధికారులు వేసిన రంగవల్లులు, గొబ్బెమ్మలు, భోగిమంటలు, పొంగళ్లు, పలు సాంస్కృతిక ఆటలు ఎంతగానో అలరించాయి. ఇలాంటి

సంక్రాంతి ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణకుమారి

సంబరాలలో అధికారులు సిబ్బంది అందరూ పాల్గొనడం వలన మానసిక ప్రశాంతతతో తమ విధులను మరింత ఉత్సాహంతో నిర్వర్తించేందుకు ఎంతగానో దోహద పడతాయని అన్నారు. మండల అభివృద్ధికి అధికారులందరూ ఐక్యమత్యంతో వారి విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందించాల్సిన సేవలను సక్రమంగా అందిస్తూ మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సంక్రాంతి పండుగ మండల పరిధిలో వైభవంగా నిర్వహించుకోవటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. సంక్రాంతి సంబరాలకు సహకరించిన అధికార సిబ్బంది అందరికీ ఎంపీడీవో కృష్ణకుమారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గత మూడు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సంబరాల పోటీలలో విజేతలుగా నిలిచిన పలువురికి తహాశీల్దారు వెంకటరెడ్డి, ఎస్ఐ రత్నకుమారి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంక్రాంతి సంబరాలు పిహెచ్‌సి సూపరింటెండెంట్ సుభాషిణి, హౌసింగ్ డిఈ, ఏపీఓ ఏపీఎం, పంచాయతీరాజ్ ఏఈ, ఈవోపీఆర్‌డి, ఎంపీపీ, మండల పరిషత్ అధ్యక్షుడు పి రజిని, సర్పంచ్ వి రేణుక, మండల పరిషత్తు అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం వైద్య సేవల్లో ఏలూరి ట్రస్ట్

సంతరావూరులో ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన ● 360 మంది హాజరు 160 మందికి కంటి వైద్య చికిత్సకు రిఫర్

ప్రజాశక్తి-చిన్నగంజాం

పేదలకు నిరంతరం కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఏలూరి ట్రస్ట్ పనిచేస్తోందని తెలుగుదేశం పార్టీ చిన్నగంజాం మండల అధ్యక్షులు పొద వీరయ్య అన్నారు. ఆదివారం చిన్నగంజాం మండల పరిధిలోని సంతరావూరు గ్రామంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత కీర్తిశేషులు నందమూరి తారక రామారావు, ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పొద వీరయ్య, ఆజాద్, సీనియర్ నాయకులు యార్లగడ్డ లక్ష్మి, జరుబుల సంధ్య, అతిన సురేష్‌లు పూలమాల వేసిన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు ప్రసంగించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా ఏలూరి చారిటబుల్ ట్రస్ట్

వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్విస్తున్నారని పేర్కొన్నారు. లక్ష మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించడం లక్ష్యంగా నిరంతరం కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు సేవ చేసేందుకు రాజకీయాలకతీతంగా ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు, మోకాళ్ల ఆపరేషన్లు, మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఏలూరి కృషి అమోఘమన్నారు.

విశేష స్పందన

ఏలూరి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి మొత్తం 360 మంది హాజరు కాగా 160 మందికి కంటి శస్త్ర చికిత్సలకు వైద్యులు రిఫర్ చేశారు. కంటి వైద్య శిబిరానికి హాజరైన వారికి ప్రత్యేక షామియనాలు వేశారు. పురుషులకు మహిళలకు వేరువేరుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. క్యాంపునకు హాజరైన వారికి బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజు, నాయకులు శ్యామ్, రాజేష్, సుబ్బారావు, పేతురు, అద్దూరు వెంకటేశ్వర్లు, రాచూరి కుమార్, అక్కయ్య, నాగయ్య రామానాయుడు, నోవా ప్రతినిధి అజయ్ బాబు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి: మంత్రి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని పెదలంక గ్రామంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు చేపట్టడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ లింగేశ్వరరావు, గుమ్మడి సాంబ శివరావు, వెంకటేశ్వరరావు, ఎంపిపి లలితకుమారి, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి, కార్యదర్శి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల కరపత్రాలు అందజేస్తున్న మంత్రి నాగార్జున

టిడిపిని అధికారంలోకి తెచ్చేందుకు కృషి

వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు సమిష్టి కృషి చేయాలని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ కోరారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అఫీషియల్ మీట్ కార్యక్రమం జరిగింది. బాపట్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి ఈ మీటింగ్‌లో పాల్గొన్న తెలుగు ప్రొఫెషనల్ వింగ్ నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తు కార్యాచరణ, తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తేవడానికి వింగ్ సభ్యులు చేయాల్సిన కార్యక్రమాల గురించి వేగేశన నరేంద్రవర్మ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ.. తెలుగుదేశం

తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యులతో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ

పార్టీ మీద అభిమానంతో దూర భారాలను సైతం లెక్కచేయకుండా ఇంత మంది ఉన్నత విద్యావంతులు, ప్రొఫెషనల్స్ రావడం సంతోషంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరిన మన రాష్ట్రాన్ని తిరిగి నిర్మించుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. ఆ పని కేవలం విజనరీ లీడర్ నారా చంద్రబాబునాయుడు వల్లనే సాధ్యమవుతుందన్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి మనమంతా కలిసికట్టుగా పని చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనకమేడల వీర, త్రినాథ్, కళ్యాణ్, ఏడు నియోజకవర్గాల వింగ్ అధ్యక్షులు, వృత్తి నిపుణులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలు విగిసి పోయారు

మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి - కొమరోలు

వైసిపి పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని మాజీ ఎమ్మెల్యే,టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌చ్ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. కొమరోలు మండలం దద్దవాడ పంచాయతీలోని పొట్టిపల్లె గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి మూడున్నర ఏళ్ళ పాలనలో పెరిగిన ధరలతో, ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో అన్ని వర్గాల ప్రజలు అల్లాడుతున్నట్లు తెలిపారు. పాదయాత్ర సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినట్లు తెలిపారు. రైతులకు అండగా ఉంటానని చెప్పి వారి కూడా మోసం చేసినట్లు తెలిపారు. ఎరువుల ధరలను పెంచి రైతులపై పెట్టుబడిని భారం మోపినట్లు తెలిపారు. ఇటీవల తుఫాన్ కారణంగా రైతులు పంటలు నష్టపోతే నేటికీ వారికి నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు. కళ్ళబోల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ రైతులను వెన్నుపోటు పొడిచారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు భోనేని వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర కమిటీ మెంబర్ అనప వీరశేఖర్, రాష్ట్ర రైతు కార్యదర్శి రాఘవరెడ్డి, మాజీ సర్పంచి బిజ్జం వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు బిజ్జం రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ బిజ్జం పార్వతమ్మ, మాజీ ఎంపిటిసి సభ్యులు ముత్తుముల సంజీవ రెడ్డి, దూదేకుల రంతు, మాజీ సర్పంచి దూదేకుల గులాం చిన్న వీరయ్య, మాజీ ఉప సర్పంచి బిజ్జం వెంకటరెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు దాసరి చెంచయ్య, శ్రీనివాసులు, పందిళ్ళపల్లి రామయ్య, కైపా బైరెడ్డి, దూదేకుల జమాల్, టిడిపి నాయకులు అల్లం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అశోక్‌రెడ్డి

బేస్తవారిపేట : బీసీలు, ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించింది టిడిపియేనని మాజీ ఎమ్మెల్యే, టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. బేస్తవారిపేట పట్టణంలోని బీసీ కాలనీ, టైలర్స్ కాలనీలలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత అశోక్ రెడ్డికి స్థానిక టిడిపి కార్యకర్తలు నాయకుల ఘన స్వాగతం పలికారు. అనంతరం అశోక్‌రెడ్డి రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం అశోక్ రెడ్డి గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సొరెడ్డి మోహన్ రెడ్డి, నాయకులు పూనూరు భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

ఎండ్లూరులో 'గడపగడపకూ'

ప్రజాశక్తి సంతనూతలపాడు రూరల్.

మండల పరిధిలోని ఎండ్లూరు గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం రూ.79.30 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, ఆర్‌బికె భవనం, హెల్త్ క్లినిక్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుంపాచెంచిరెడ్డి, జడ్‌పిటిసి దుంపా రమణమ్మ, ఎంపిపి బి.విజయ, స్థానిక సర్పంచి ఎస్. పుల్లయ్య, ఎంపిటిసి కె. వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి మారుతీ దేవి, సంతనూతలపాడు సొసైటీ అధ్యక్షుడు దుంపా యలమందరెడ్డి, ఎంపిడిఒ ప్రసాద్, పిఆర్ డిఒ కష్ణమోహన్ , ఎఇ రవిబాబు , విద్యుత్ ఎఒ నాగేంద్ర రెడ్డి, ఎపిఎం సుధాకర్ రావు, గ్రామ కార్యదర్శి ధారా వెంకట్రావు, విఆర్‌ఒ మౌలాలి, ఎపిఒ వాసంతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వాలిబాబు, వైసిపి నాయకులు కుంచాల అంజయ్య, లక్ష్మీనారాయణ, కొండలరావు లక్ష్మయ్య తిరుమల, సుధాకర్ రావు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మద్దిపాడు

అనాధలు, పేదలకు ఆర్థిక, విద్యాపరంగా అండగా ఉంటామని మద్దిపాడు మండల యూనిట్ నిర్వాహకుడు పిఎస్‌ఆర్ తెలిపారు. స్థానిక ఇండియన్ గ్యాస్ కంపెనీ సమీపంలో నివాసముంటున్న ఎస్‌టిలకు ఆదివారం దుప్పట్లు, ప్లాస్టిక్ బక్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఎస్‌ఆర్ మాట్లాడుతూ ప్రతి మొదటి ఆదివారం మండల పరిధిలోని ఒక గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌ఆర్ యూత్‌ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

కొండయ్యకు మంత్రి సురేష్ నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని కెవిపాలెంకు చెందిన వైసిపి యువనాయకుడు, మాజీ ఎమ్మెల్యే వుమాయల్లయ్య మేనల్లుడు రాతిక్రింది కొండయ్య(55)కు పలువురు నివాళులర్పించారు.కొండయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొండయ్య చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న రాష్ట్ర పురపాలకమంత్రి ఆదిమూలపు సురేష్,జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి తదితరులు కొండయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

చీకటి జీవోను రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి సంతనూతలపాడు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి జీవో నంబర్ 1ని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్లో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌కె. మాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ ఒకటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జీవో నంబరు కాపీలను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకుడు నెరుసుల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు కిలారి పెద్దబ్బాయి, షేక్ మస్తాన్ , డి.చిన్నబాబు, ఎ. శేషారావు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో జీవో కాపీని దహనం చేస్తున్న నాయకులు

కొత్తపట్నం : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబరు 1ని రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.స్వామిరెడ్డి మాట్లాడుతూ జీవో నంబరు 1 రద్దు చేసే వరకూ ఐక్యపోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. సిపిఐ ఎంఎల్ మండల నాయకులు శ్రీరాములు రెడ్డి మాటలాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రిటిష్ కాలం నాటి జీవోలను తీసుకువచ్చి ప్రతి పక్షాలను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రభాకర్, రామణయ్య, సిపిఐ ఎంఎల్ నాయకులు కోటేశ్వరరావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు

కొత్తపట్నంలో నిరసన తెలుపుతున్న నాయకులు

15 నుంచి ఎడ్లపోటీలు

కొత్తపట్నం : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని పాదర్తి గ్రామంలో ఈనెల 15,16 తేదీల్లో ఆంధ్ర -తెలంగాణ రెండు రాష్ట్రాల స్థాయిలో బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కట్టా శేఖర్ తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో కొత్తపట్నం ఎంపిపి లంకపోతు అంజిరెడ్డి సారధ్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా దాత మూగ బాలాజీ 1,00,000, ద్వితీయ బహుమతిగా దాత సిహెచ్. వీరరాఘవులు రూ.50,000, తృతీయ బహుమతిగా దాత యలగాల ఆదినారాయణ రూ.40,000, నాల్గవ బహుమతిగా దాత పాలేటి ఆంజనేయులు రూ. 30,000, ఐదో బహుమతిగా దాత గుడి నాగిరెడ్డి రూ.20, 000, ఆరో బహుమతిగా దాత జజ్జన హరి నారాయణ రూ.15,000 , ఏడో బహుమతి దాత పాకల చిరంజీవి రూ.12,000, ఎనిమిదో బహుమతిగా దాత కట్టా శేఖర్ సౌందర్య రూ. 10,000, తొమ్మిదో బహుమతిగా దాత పంటరంగం బ్రహ్మయ్య రూ. 8,000 అందజే యనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు యాంకర్స్‌గా రాధాకష్ణ కష్ణాజిల్లా, జి. నరసింహారెడ్డి వ్యవహరించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8121761361,7780169765 సెల్‌నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

దర్శి : దర్శి నగర పంచాయతీ పరిధిలోని శివరాజ్‌నగర్‌లో పట్టణ తెలుగుయువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను దర్శి మాజీ మ్మెల్యే నారపశెట్టి పాపారావు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నగరపంచాయితీ వైస్ చైర్మన్ స్టీవెన్, టిడిపి మండల అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, 10వ వార్డు కౌన్సిలరు పసుపులేటి దత్తాత్రేయ, ఐటిడిపి ఛాంపియన్ సంగు రామయ్య, శ్రీనాథ్, సురేష్, రమేష్, నారాయణ, రవి పాల్గొన్నారు.

10 నుంచి క్రికెట్ టోర్నమెంట్

పొన్నలూరు : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని పైరెడ్డిపాలెంలో ఈ నెల 10 నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.2 వేల ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.25 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 8142822122, 7093518010 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

14 నుంచి కబడ్డీ పోటీలు

కొనకనమిట్ల : మండల పరిధిలోని గొట్లగట్టు గ్రామంలో ఈ నెల 14 నుంచి 16 వరకూ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గొట్లగట్టు వైస్ ప్రెసిడెంట్ గాడి కోనేటిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, నాయకులు కోటపాటి వెంకట కొండయ్య, పొలసాని నారాయణరెడ్డి, నాగం వెంకటేశ్వర్లు, నాగం ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ. 30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 25 వేలు, మూడో బహుమతిగా 20 వేలు, నాల్గో బహుమతిగా రూ. 15 వేలు, ఐదో బహుమతిగా 10.వేలు, ఆరో బహుమతిగా రూ.6 వేలు అంద జేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు గుమ్మా శ్రీనివాసులు 80964 76870, నాగం వెంకటేశ్వర్లు 9912312365 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు మంత్రి సురేష్ పెద్దదోర్నాల రాక

పెద్దదోర్నాల : రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం ఉదయం 10 గంటలకు దోర్నాలలోని ఏకోటూరిజంలో మండలంలోని అన్ని సచివాలయాల కన్వీనర్లతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు దోర్నాల-2 సచివాలయ పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వంలో పాల్గొంటారు. రాత్రి 8 గంటలకు త్రిపురాంతకం మండలం ఎండూరి వారిపాలెంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి సురేష్ పిఎ ప్రభాకర్ శర్మ తెలిపారు.

ఏ రాజకీయ పార్టీలోనూ చేరను

మా ఊరు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి - టంగుటూరు

తాను జీవితంలో ఇకపై ఏ రాజకీయ పార్టీలోనూ చేరబోనని కారుమంచి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు మాత్రమే కషి చేస్తానని రాష్ట్ర మధ్య విమోచన ప్రచార కమిటీ మాజీ చైర్మన్, మా ఊరు అభివద్ధి కమిటీ అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి స్పష్టం చేశారు. కారుమంచి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కారుమంచి అభివద్ధి కోసం ఎన్ని అవమానాలనైనా భరిస్తానని తెలిపారు. ఊరు మీద పడి బతికే వాళ్ళ విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. గత మూడేళ్లుగా అధికార పార్టీలో ఉన్నత స్థాయి పదవిని అనుభవించి ఇప్పుడు ఏ రాజకీయ పార్టీలోనూ చేరనని చెప్పడం ఏమిటని విలేకర్లు ప్రశ్నించగా వైసీపీలో తనకు సభ్యత్వం కూడా లేదని, జగన్మోహన్ రెడ్డే తనకు పిలిచి పదవి ఇచ్చారని చెప్పారు. గ్రామ అభివద్ధి కోసం ముందుకొచ్చి చందాలు ఇచ్చిన ప్రతి రూపాయిని సద్వినియోగం చేసానే తప్ప నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదన్నారు. గ్రామంలోని ఊర చెరువును రాష్ట్రంలోనే పరిశుభ్రమైన చెరువుగా అభివద్ధి చేసినట్లు తెలిపారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు రూ 4.70 లక్షలు ఇచ్చినట్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అశోక్ బాబు తనకు రూ. 20,000 మాత్రమే పంపినట్లు తెలిపారు. రూ. 20 వేలకు తాను మరో రూ. 5000 కలిపి అశోక్ బాబు ప్రతినిధి నవీన్‌కు ల్యాప్ టాప్ కొనిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మా ఊరు అభివద్ధి కమిటీ కోఆర్డినేటర్ బత్తుల కష్ణ, కమిటీ సభ్యులు చిట్టేల రామిరెడ్డి, కంజుల సుబ్బారెడ్డి, ఏకశిరి శ్రీను, గాలం జాలరామయ్య, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి

ఫ్యాప్టో జిల్లా జనరల్ సెక్రటరీగా దద్దాల శ్రీనివాసులు యాదవ్

ప్రజాశక్తి-కనిగిరి

ఫ్యాప్టో జిల్లా జనరల్ సెక్రటరీగా కనిగిరికి చెందిన బిటిఎ జిల్లా అధ్యక్షుడు దద్దాల శ్రీనివాసులు యాదవ్ ఎన్నియ్యారు. ఎపిటిఎఫ్, బిటిఎ,యుటిఎఫ్,ఎన్‌టియు సంఘాల ఆధ్యర్యంలో నూతన కమిటీని ఆదివారం ఎన్ను కున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఫ్యాప్టో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లగుంట్ల మోహన్‌రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీగా ఎన్నికైన దద్దాల శ్రీనివాసులు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎదుర్కొనే సమస్యలు ఉద్యమాల ద్వారానే పరిష్కరం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ ఆంథోని, గౌరవాధ్యక్షుడు చిన వెంగయ్య,రాష్ట్ర నాయకులు పర్రె వెంకట్రావ్,ఎంఇఒ సంఘాల నాయకులు నాగేంద్రవదన్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ బాలకృష్ణమ్మకు నివాళి

ప్రజాశక్తి-దర్శి

మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ సేవలు మరువలేనివని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెవిజి.కీర్తి తెలిపారు. స్థానిక ఎపిటిఎఫ్ కార్యాలయంలో మార్పు బాలకృష్ణమ్మ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారం కోసం బాలకృష్ణమ్మ ఎంతో కృషి చేసినట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలాజీ, వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె వెంకటేశ్వరరావు, బుర్రా శ్రీను, నాగరాజు, బాలకోటిరెడ్డి, సుధాకర్, రోశయ్య, అప్పన్న, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అప్పటి గురువులకు మంగళ వాయిద్యాలతో పాఠశాల వద్దకు తీసుకొచ్చారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు జివి.నారాయణ, దిట్ట కవి శ్రీనివాసరావు, నాగయ్య, తెలుకుట్ల మల్లారెడ్డి, సుబ్బమ్మ, రికార్డు అసిస్టెంట్ మన్నువ కోటయ్య, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు రూరల్ : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1976 -77 విద్యా సంవత్సరంలో పదవ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. అప్పటి మధుర స్మతులను జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు. అనంతరం తమకు అప్పట్లో విద్యాబోధన చేసిన గురువులు నరసింహారావు, వై భాస్కరరావు, ముఖ్యఅథితులు కత్తి రవీంద్రబాబు, రహంతుల్లా, కోదాటి కోటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా ఓటరు లిస్టు

సంతనూతలపాడు రూరల్ : కొత్తగా ప్రచురించిన ఓటరు లిస్టులు తప్పులు తడకగా ఉన్నాయని టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి కార్యకర్తలు, ముఖ్య నాయకుల ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో 5,300 మంది ఓటర్లు మృతిచెందినట్లు తెలిపారు. అయినప్పటికీ వారి ఓట్లు తొలగించలేదని తెలిపారు. డబల్ ఎంట్రీ కూడా తీసివేయకుండా నియోజకవర్గంలో 2,500 ఓట్లు పెరిగినట్లు ప్రకటించటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిల సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా ఇమాంసా

ప్రజాశక్తి-పొదిలి

ఆర్ఎంపిల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పొదిలికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు సయ్యద్ ఇమాం సాహెబ్ నియమితులయ్యారు. స్థానిక సాయి బాలాజీ కళ్యాణ మండపంలో ఒంగోలు చైతన్య కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాలకు చెందిన ఆర్ఎంపిలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపిల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఇమాంసాను ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా డాక్టర్ ఇమాంసాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఆర్ఎంపిల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు కతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఒంగోలు చైతన్య కార్డియాక్ వైద్యుడు డాక్టర్ కృష్ణ చైతన్య, పొదిలి, మర్రిపూడి, కొనకనమిట్ట మండలాల ఆర్ఎంపి వైద్యులు లక్ష్మి నారాయణ, సిహెచ్.విజయ భాస్కర్ రావు, ఐ.ఆదినారాయణ, హనుమంతరావు, ఆనంద్, నాగయ్య, మోహన్ రావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇమాంసాహెబ్‌ను సత్కరిస్తున్న నాయకులు

అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని బ్లూ వింగ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు పులి మల్లికార్జున్‌రావు తెలిపారు. ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సంఘం శరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పులి మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ .బ్లూ వింగ్స్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా భీమ్ కోరేకావ్ యుద్ధ మహర్ వీరుల త్యాగాలను స్మరిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నాటక ప్రదర్శన జరుగుతున్న ఐదు గ్రామాలలోని యువతకు అంబేద్కర్ జీవిత చరిత్రపై అవగాహన, సాహిత్యం పుస్తకాలు ఉచితంగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ శివరామకష్ణరావు, జిల్లా కోఆర్డినేటర్ మెడబలిమి కోటేశ్వరరావు, నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ కూరపాటి విజయరాజు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పర్రె వెంకట్రావు, అంబేద్కర్ వాది కంకణాల ఆంజనేయులు బల్లికురవ వెంకట్, అస్సెక్ రాష్ట్ర నాయకులు రాజేష్ బాబు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే స్వామి నివాళి

ప్రజాశక్తి- శింగరాయకొండ

శింగరాయకొండకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు పత్తి శ్రీనివాస రావు ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను శాసనసభ్యులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూనపు రెడ్డి వెంకటసుబ్బారావుచ, షేక్ సంధాని బాషా, షేక్ సనాఉల్లా తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

'రాక్‌వెల్' కు బ్రైన్ ఫీడ్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని రాక్‌వెల్ పబ్లిక్ స్కూల్ (ఇంటర్నేషనల్)కు అవార్డుల పంట పండుతోంది. ఆ స్కూల్‌లో కల్పించిన సకల సౌకర్యాలతో పాటు విద్యా బోధనలో అవలంబిస్తున్న విన్నూత్న పద్దతులే అవార్డులు పొందటానికి కారణం. తాజాగా బ్రైన్ ఫీడ్ స్కూల్ ఎక్సలెన్స్ సంస్థ దేశ వ్యాప్తంగా విన్నూత్న పద్దతిలో విద్యను బోధిస్తున్న పాఠశాలలపై సర్వే నిర్వహించింది. అందులో మార్కాపురంలోని రాక్‌వెల్ పబ్లిక్ స్కూల్ అగ్ర విద్యా సంస్థగా గుర్తించింది. ఈ మేరకు ఆ స్కూల్‌కు బ్రైన్ ఫీడ్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డును ప్రకటించింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాక్‌వెల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వెన్నా నాగార్జునరెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ చైర్మన్ వెన్నా పోలిరెడ్డి, సిబ్బంది తదిరులు నాగార్జునరెడ్డిని అభినందించారు.

అవార్డు అందుకుంటున్న నాగార్జునరెడ్డి

చీకటి జీవోలతో ఉద్యమాలను అణిచివేయలేరు

ప్రజాశక్తి-కొండపి

చీకటి జీవోలను ఉద్యమాలను అణచి వేయలేరని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు, ప్రకాశం జిల్లా సమన్వయకర్త ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. మహాజన సోషలిస్టు పార్టీ కన్వీనర్ పూనూరి కిష్టాపర్ మాదిగ ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ మహాజన సోషల్ పార్టీని మండల గ్రామం స్థాయిలో బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పాలనతో ముందుకు వెళుతుందన్నారు. ప్రజా స్వేచ్ఛను హర్షిస్తూ చీకటిజీవోలకు ఉద్య మాలను అణిచివేయాలని చూస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కొండపి నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ ఇన్‌ఛార్జిగా పూనూరి కిష్టాపర్‌ను నియమించినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రావినూతల చంద్ర మాదిగ, రావినూతల కోటి మాదిగ, రేగుమాల మాదవ మాదిగ, బసవయ్య మాదిగ, కాములూరి గోవర్ధన్, లెక్కపోగు రాజేష్, పెమల జాలయ్య, పందిటి పూర్ణచంద్రరావు, కొమ్ము కోటి, పిల్లిపోగు సిసింద్రీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

మిర్చితోటలో గంజాయి సాగు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతం పాలుట్ల గిరిజన గూడెంలో యథేచ్ఛగా గంజాయి సాగవుతోంది. ఎస్‌పి మల్లికగర్గ్ ఆదేశాల మేరకు యర్రగొండపాలెం సెబ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ ఆధ్వర్యంలో పాలుట్ల గిరిజన గూడెంలో ఆదివారం దాడులు నిర్వహించారు. నేనావత్ బలరాం నాయక్ మిరప తోటలో 35 గంజాయి మొక్కలు, జండవత్ బద్దు నాయక్ మిరప తోటలో 8 గంజాయి మొక్కలను గుర్తించారు. అధికారులు నామమాత్రంగా దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో పశ్చిమ ప్రాంతంలో యథేచ్ఛగా గంజాయి సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో ఎస్ఇబి సిఐ ఎన్ వెంకట రమణ, ఎస్ఇబి కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్లు, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

వీరి విజయం.. ఉద్యమాలకు స్ఫూర్తి ● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల నుంచి పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఓటర్లుగా నమోదు చేసుకున్న వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపు ఉద్యమాలకు స్ఫూర్తి అని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఉన్నత విద్యావంతుడనై, సామాజిక స్పృహ కలిగి నిత్యం ప్రజా ఉద్యమాల్లో ఉంటూ, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తున్న ఉద్యమ అభ్యర్థినైన తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత మూడున్నర ఏళ్లుగా విద్యారంగంలో అనేక సమస్యలు, సంక్షోభాలు ఎదురయ్యాయని తెలిపారు. యూనివర్సిటీలకు నిధులు, నియామకాలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విలీనాన్ని తీసుకొస్తే కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే చట్టసభల్లో పోరాడారని తెలిపారు. బస్‌యాత్ర చేసి ప్రజలను చైతన్యపరచి రాష్ట్రంలో కనీసం వెయ్యి పాఠశాలలను మూసి వేయకుండా నిలుపుదల చేయడానికి దోహదపడ్డారని పేర్కొన్నారు.

ప్రస్తుత పాలకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు..

ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దలు, పాలకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ప్రశ్నించే వారినిపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ప్రజావ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు నిరసనలు తెలియజేస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ఉద్యమం పేరు చెబితేనే భయపడేలా పాలకులు పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన చేయడం శోచనీయమన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆకాశాన్నంటే ధరలు, పన్నుల పెంపు, కనీస వేతనం కరువైంది. రెగ్యులర్ ఉద్యోగాలు, టైం స్కేల్ మాట అటకెక్కింది. సిపిఎస్ రద్దు చేయమంటే కప్పదాటు సమాధానాలు చెబుతున్నారు. తాము చెప్పిందే వేదం అనేలా పాలకులు వ్యవహరించడం దారుణమన్నారు. కేంద్రం వ్యవహరిస్తున్న దుర్మార్గపు తీరుకు రాష్ట్ర పాలకులు వంతపాడేలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కాస్తో కూస్తో కార్మికులకు, ఉద్యోగులకు, యువతకు, సంఘటిత, అసంఘటిత వర్గాల ప్రజలకు మంచి జరుగుతుందంటే అందుకు కారణం ప్రస్తుతం శాసన మండలిలో ఉన్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ప్రభుత్వాన్ని నిలదీయడమేనని పేర్కొన్నారు.

ఉద్యమాలే ఊపిరిగా పని చేస్తూ..

తాను ఉపాధ్యాయుడిని కాక ముందు నుంచి పోరుబాటలో నడుస్తున్నానని, ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన తర్వాత యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేశామన్నారు. యుటిఎఫ్‌లో 1984లో సర్వీసులో చేరిన రోజు నుంచి సంఘ కార్యకలాపాలలో ఉన్నారు. 1986లో మొదటిగా మండలాలు ఏర్పడినప్పుడు లింగసముద్రం మండలం మొదటి ప్రధాన కార్యదర్శిగా, 1992లో జిల్లా కార్యదర్శి, 2000లో జిల్లా అధ్యక్షులు, తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు, తర్వాత ఐక్య ఉపాధ్యాయ పత్రిక సంపాదకవర్గ సభ్యులుగా వ్యవహరించారు. తాను అనేక ప్రభుత్వాలను, ఎంతోమంది పాలకులను, వారి తీరును చూశానని, ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధంగా వ్యవస్థలను వాడుకోవడం ఎప్పుడూ లేదన్నారు. జీతాల కోసం కూడా ధర్నాలు చేసే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి 'ఉపాధ్యాయ సంఘాలు సమస్యల కోసం డిమాండ్ చేయడం కాదు.. కాళ్లు పట్టుకొని బతిమిలాడుకోవాలి' అని వ్యాఖ్యానించడం గర్హనీయం అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి జీతాలు ఎప్పుడైనా ఇస్తాము.. ఒకటో తేదీనే ఇవ్వాలని ఉపాధ్యాయులు, ఉద్యోగులు కోరడం సరికాదనడం శోచనీయమన్నారు.

పాఠశాలల అభివృద్ధి కోసం..

తాళ్లూరు యుపి స్కూల్లో పనిచేస్తూ గ్రామస్తుల సహకారం, మాగుంట సుబ్బరామిరెడ్డి సహకారంతో దానిని హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయించడం. మార్కొండపురం యుపి స్కూల్లో పనిచేస్తూ గ్రామస్తుల సహకారం ఐదు ఎకరాల స్థలం ఉచితంగా సేకరించి, సొంత ఖర్చులతో హైస్కూల్ అప్‌గ్రేడ్ చేయించినట్లు తెలిపారు. తదుపరి కంచర్లవారి ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఆ స్కూల్ రోల్ 450 నుంచి 670 మంది వరకు పెంచడం, తోటి సిబ్బంది సహకారంతో 10వ తరగతి విద్యార్థులు సగటున ప్రతి సంవత్సరం 160 మందిని ఫిబ్రవరి నుంచి పరీక్షలు అయిపోయే వరకు స్కూల్‌లోనే ఉంచి చదివించడం వల్ల పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించారన్నారు.

ఉద్యోగుల బకాయిలకు అతీగతీ లేదు..

ఈరోజు ఉపాధ్యాయులకు, ఉద్యోగు లకు గత మార్చి నుంచి రూ.రెండు వేల కోట్ల పిఎఫ్ క్లోజర్‌లు, లోన్లు, బకాయిలు ఉన్నారని తెలిపారు. అదే విధంగా ఏపిజిఎల్‌ఐ బకాయిలు గత సంవత్సరంగా కొనసాగుతున్నాయని చెప్పారు. పెన్షనర్ల కరువు భత్యం బకాయిలు 60 నెలలవి, పిఆర్‌సి నుంచి నేటికీ చెల్లించలేదని, సరండర్ లీవ్‌లు, సంపాదిత సెలవులు, బకాయిలు కోట్లాదిగా పేరుకొని పోయాయని ఆరోపించారు. అది చెల్లించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉద్యోగులు కట్టిన సొమ్ములు నేటికీ ఎన్‌ఎస్‌డిఎల్‌కు చేరలేద న్నారు. దాదాపుగా రూ.4,870 కోట్లు ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకుం దని ఆరోపించారు. మొత్తంగా రూ.20 వేల కోట్ల బకాయిలు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాలని చెప్పారు. వాటిని చెల్లించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

ఉద్యమం అంటనే ఉక్కుపాదం మోపుతున్నారు..

ఉపాధ్యాయులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించిన డీఈవోలపై చర్యలు తీసుకునే వరకు పోరాటం జరిపి, ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా విజయం సాధించామని గుర్తు చేశారు. కానీ నేడు ప్రభుత్వం ఉద్యమం అంటేనే ఉక్కుపాదం మోపేలా వ్యవహరిస్తోందన్నారు. ఇలాంటి తరుణంలో కనీసం చట్టసభల్లోనైనా ఈ ప్రభుత్వాన్ని నిలదీయాలంటే నిజాయితీ, నిస్వార్థం, ధైర్యవంతులైన ప్రజా ప్రతినిధులు అవసరమని అన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులుగా సామాజిక ఉద్యమాలలో ఉన్న వారిని, మచ్చ లేని వారినే ప్రకటించారని, వారిని ఆదరించి, 2023 మార్చిలో జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిపించి ఉద్యమ స్ఫూర్తిని మరోసారి ఎలుగెత్తి చాటాలని తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి కోరారు.

నిర్మాణంలో ఉన్న ఓ గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి: ఎమ్మెల్యే కరణం

ప్రజాశక్తి-చీరాల

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు అందజేస్తున్న జగనన్న గృహాలను ఆయా కాంట్రాక్టర్లును, లబ్ధిదారులను సమన్వయం చేసుకుంటూ త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కరణం బలరాం కష్ణమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని చీరాల నగర్ 2 లో నిర్మిస్తున్న జగనన్న కాలనీ లే అవుట్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతంగా నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గృహ నిర్మాణాలలో లక్ష్యాలను సాధించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాంట్రాక్టర్లను గృహ నిర్మాణ లబ్ధిదారులను సమన్వయం చేస్తూ గృహాలను వేగవంతంగా నిర్మించాలని సూచనలు చేశారు. గృహ నిర్మాణాలకు సంబంధించి అన్ని వసతులను లబ్ధిదారులకు కల్పించాలని అన్నారు. రోడ్లు, ఇసుక, సిమెంటు, నీటి కొరత వంటి సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. కాలనీలో లబ్ధిదారులు నివాసం ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేసి విద్యుత్తు సౌకర్యం కల్పించాలని అన్నారు. అనంతరం కోర్టు రోడ్డులో జరిగిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో నేతాజీ, హౌసింగ్, ఏఈ శ్రీనివాస్, వాసి మళ్ల వాసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

- 3894 మంది హాజరు - 1649 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షల కోసం జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఎపిపిఎస్‌సి గ్రూప్-1లో ఉదయం జరిగిన పరీక్షలకు మొత్తం 5531 మందిని కేటాయించగా, 3894 మంది హాజరు కాగా 1637 మంది గైర్హాజరు అయ్యారు. హాజరు శాతం 70.40 నమోదైంది. మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటలకు వరకు జరిగిన పరీక్షలు మొత్తం 5531 మందిని కేటాయించగా, 3882 మంది హాజరు కాగా 1649 మంది గైర్హాజరు అయ్యారు. హాజరు శాతం 70.18 నమోదైంది. ఒంగోలు ఏకెవికె జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షల తీరును జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు పరిశీలించారు. ఓఎంఆర్ షీట్లు, అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్లోరియా, ఎపిపిఎస్‌సి అధికారులు పాల్గొన్నారు.

14న పాటల పోటీలు

ప్రజాశక్తి-రేపల్లె

షైనింగ్ స్టార్స్ అకాడమీ, జిఓడి డయాసిస్ ఆధ్వర్యంలో రేపల్లె పట్టణం, 5వ వార్డులోని క్రీస్తు ప్రార్థన మందిర ఆవరణలో డివిజన్ స్థాయిలో షైనింగ్ స్టార్స్ అకాడమీ అవార్డ్స్ క్రైస్తవ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుల కమిటీ, కో ఆర్డినేటర్ డి పాల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచినవారు ఆధార్ కార్డు, ఫొటోతో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. గెలుపొందిన వారికి ఫస్ట్, సెకండ్, థర్డ్ సర్టిఫికెట్స్, మెమెంటో అందజేస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగు ఈవెంట్‌లో పాల్గొనటానికి రాష్ట్ర స్థాయి ఎంపిక కోసం పంపుతామని తెలిపారు. వివరాలకు 9493022713 ఫోన్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

ఇంజనీరింగ్ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన సూర్యతేజను సత్కరిస్తున్న దృశ్యం

సహాయకుల సంఘం అధ్యక్షుడిగా సూర్యతేజ

ప్రజాశక్తి-పొదిలి

ఇంజనీరింగ్ విభాగం సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సూర్యతేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ఇంజినీరింగ్ సహాయకుల కార్యవర్గ ఎన్నిక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మూడు ఇంజినీరింగ్ సబ్ డివిజన్ల పరిధిలో డివిజన్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. మార్కాపురం ఇంజనీరింగ్ డివిజన్ అధ్యక్షుడిగా రవితేజ, కనిగిరి డివిజన్ అధ్యక్షుడిగా షారుఖ్, ఒంగోలు డివిజన్ అధ్యక్షుడిగా రాజశేఖర్ ఎన్నికయ్యాడు.

గానుగలకు విద్యుత్ రాయితీ కల్పించాలి

ప్రజాశక్తి-పొదిలి

గాండ్ల తెలికుల కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని, గానుగలకు విద్యుత్ రాయితీ కల్పించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గాండ్ల సంక్షేమ సంఘం జిల్లా కేలండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో పొదిలి యూనిట్ అధ్యక్షుడు చిట్టెం శెట్టి వెంకట కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి దాసరి గురుస్వామిల ఆధ్వర్యంలో కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం నాయకులు బట్టు రామారావు, వరికుంట్ల వెంకటేశ్వర్లు, ఏరువ వెంకట రామయ్య, బట్టు పిచ్చయ్య, న్యాయవాది దుడ్డు హరిప్రసాద్, బూదాటి నిమ్మయ్య, బూదాటి సత్య నారాయణ, వరికుంట్ల హరిబాబు, చిట్టెం శెట్టి శివయ్య, ఆళ్ల చెరువు విక్రమార్క్, గిరి, సీతయ్య గారి వెంకటేశ్వర్లు, యూత్ కన్వీనర్ చిట్టెంశెట్టి అనూష, చిట్టెం శెట్టి కోటేశ్వరి, వరికుంట్ల అంజమ్మ, దుడ్డు పద్మ, మాడిశెట్టి ఆదిలక్ష్మి, చిట్టెం శెట్టి భార్గవి, బట్టు లక్ష్మి, బూదాటి దివ్య, గుంటిక సరస్వతి పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి-ఒంగోలు

జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. గత రెండు రోజులుగా చలి గజగజా వణికిస్తోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి ఎనిమిది గంటలు దాటితే ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఫలితంగా ప్రయాణికులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు చలి తీవ్రతకు అనారోగ్యాకి గురవుతున్నారు. జలుబు, దగ్గు తదితర రోగాల బారిన పడుతున్నారు. తెల్లవారుజాము నుంచే మంచు కురుస్తుండడంతో ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. మంచు కారణంగా ముందు వెళ్లే వాహనాలు కనిపించక వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు.

మంగమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మంగమ్మ ఆశయాల కోసం

ప్రతి మహిళా కృషి చేయాలి : హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

దివంగత మండ్లా మంగమ్మ ఆశయాల కోసం ప్రతి మహిళ కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ కోరారు. మండ్లా మంగమ్మ 5వ వర్ధంతి సభ జి భానుమతి అధ్యక్షతన సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ మంగమ్మ సారా ఉద్యమంలో పోరాట యోధురాలని తెలిపారు. పామూరు మండలంలో మహిళలకు ఏ సమస్య వచ్చినా వారికి అండగా నిలబడి వారి సమస్యలు పరిష్కరించిన ఘనత ఆమెకే దక్కిందన్నారు మహిళలు అన్ని రంగాలలో అనేక సమస్యలతో ఉన్నారని వారికి ప్రస్తుతం ఐద్వా నాయకులు అండగా ఉండాలన్నారు. నివాళు లర్పించిన వారిలో షేక్ మీరావలి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డి షమ్మీ, ఊసా వెంకటేశ్వర్లు, బత్తుల నాగేశ్వరరావు, షేక్ మదారమ్మ, ఖాదరున్నీసా, శంకర్, అంజలి, వీరనారాయణ, షేక్ మస్తాన్, ధనలక్ష్మి, ప్రభావతి ఉన్నారు.

మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి..

షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో మంత్రి సురేష్

ప్రజాశక్తి-మార్కాపురం

మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కోరారు. స్థానిక వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను మంత్రి డాక్టర్ సురేష్ ఆదివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలో ఎందరో క్రీడాకారులు ఉన్నార న్నారు. అలాంటి వారిని ప్రోత్సహిం చాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కాపురం ప్రాంత క్రీడాకారులు రాణించేలా ప్రోత్సహిం చాలన్నారు. ఈ ప్రాంతంలో సరైన సదుపాయాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడు తున్నారన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం తగిన సౌకర్యం కల్పిస్తుందన్నారు. క్రీడాకారులకు వేదికగా మార్కాపురంలో వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు తెలుగు తేజాలు పి.వి.సింధు, కిదాంబి శ్రీకాంత్ లాంటి

షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

బ్యాడ్మింటన్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటారని గుర్తు చేశారు. అలాంటి వారిని ఇక్కడి క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మార్కాపురం కేంద్రంగా తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి టోర్నమెంట్ల ద్వారా క్రీడాకారుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. అండర్-12, 14, 16 కేటగిరీల్లో తరచూగా టోర్నమెంట్లు నిర్వహించి ప్రతిభగల చిన్నారులకు చేయూత నందించాలని నిర్వాహకులకు సూచించారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ క్రీడలు శరీరకంగా ఆరోగ్యానికి దోహదం చేస్తాయని అన్నారు. క్రీడలు నాయకత్వ లక్షణాల పెంపుదలకు ఉపయోగ పడతాయన్నారు. మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి మంచి టోర్నమెంట్ల ద్వారా క్రీడాకారులు నైపుణ్యాలను మెరుగు పర్చుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయ పడ్డారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి డాక్టర్ సురేష్, ఎమ్మెల్యే వెంకట రాంబాబులు కొద్దిసేపు షటిల్ ఆడి క్రీడాకారులను ఉల్లాస పరిచారు. రెండు రోజులపాటు క్రీడాకారులకు అల్పాహారం, భోజనం ఏర్పాటు చేసేందుకు సహకరించిన గుండారెడ్డి శ్రీనివాసరెడ్డి సోదరులను ఈ సందర్భంగా అభి నందించారు.,ఈ కార్యక్రమంలో యర్రగొండ పాలెం ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మార్కాపురం ఎంపిపి పోరెడ్డి అరుణచెంచిరెడ్డి, మాజీ ఎంపిపి అమిరెడ్డి రామిరెడ్డి, వైసిపి పెద్దారవీడు మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జాతీయస్థాయి బ్యాడ్మింటన్ రిఫరీ జిలాని, మార్కాపురం స్పోర్ట్స్ అండ్ యోగ క్లబ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేశ్వరరెడ్డి, అమీర్‌బాషా పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- స్కానింగ్ సెంటర్ల పై నిఘా
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ

ముఖాముఖి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ తెలిపారు. జిల్లాలోని 25 మండలాల పరిధిలో 43 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 94 మంది వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 12 అర్బన్ హెల్త్ సెంటర్లు, 8 హెల్త్ కమ్యూనిటీ సెంటర్లు, 364 హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 25 104 వాహనాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల నూతనంగా ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ అమలులో భాగంగా స్థానిక పిహెచ్‌సిలోని ఇద్దరు వైద్యుల్లో ఒకరు 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా ప్రజలకు అందదిస్తున్న వైద్య ఆరోగ్య సేవల గురించి డాక్టర్ విజయమ్మ ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆమె మాటల్లోనే...

గ్రామీణ ప్రాంత గర్భిణులకు వైద్యసేవలు

గ్రామీణ ప్రాంత గర్భిణులకు ప్రత్యేకంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రసవం కోసం వచ్చే గర్భిణులకు స్థానికంగా వైద్యం లభించక గుంటూరు, విజయవాడ వెళ్ళాల్సివస్తున్న నేపథ్యంలో పిహెచ్‌సిల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు చేపడుతున్నారు. ఇందుకు అనుగుణంగా గర్భిణులకు మెరుగైన సేవలు అందిస్తూ, పిహెచ్‌సిల్లో తగిన వైద్య పరికరాలు, సిబ్బంది నియామకం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా అందుబాటులోకి తెస్తున్నారు. గర్భిణి డెలివరి విషయంలో ఇబ్బంది ఏర్పడితే ముందు బాపట్ల తరువాత గుంటూరు, విజయవాడ ఇలా కాకుండా నేరుగా మెరుగైన వైద్యం కోసం వారు కోరుకున్న వైద్యశాలకు పంపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో వేరే పట్టణానికి వెళ్ళాల్సి వస్తే అందుబాటులో 108 వాహనం లేకపోతే వారు ప్రయివేట్ వాహనం ఏర్పాటు చేసుకుని వెళితే వారికి సదరు రవాణా ఖర్చులు కూడా ఇస్తున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన నివారణ చర్యలు చేపడుతున్నారు.జిల్లాలోని వైద్య ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసి దోమల, లార్వాల నివారణ కోసం తగిన చర్యలు తీసుకుంటున్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణలో భాగంగా కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ల ద్వారా తగిన ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నారు.

స్కానింగ్ సెంటర్ల పై నిఘా

చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు జరిపి ఆడశిశువులను అర్థాంతరంగా కడతేరుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో స్కానింగ్ సెంటర్ లపై నిఘా పెడుతున్నారు. మొదటి కాన్పులో ఆడపిల్ల జన్మించి, రెండో సారి గర్భం దాల్చిన సమయంలో రెండో బిడ్డ ఆడపిల్ల అయితే స్కానింగ్ ద్వారా తెలుసుకుని అబార్షన్లు చేయిస్తున్నట్లు తెలుస్తుంది. ఇలాంటివి జరుగకుండా స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టారు. ఆకస్మిక తనిఖీలు చేయడం, డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. జిల్లా లోని అన్ని పిహెచ్‌సిల పరిధిలో మొదటిసారి ఆడపిల్ల పుట్టి రెండోసారి గర్భం దాల్చిన వారిపై 3 నెల నుంచి నిరంతర పర్యవేక్షణ జరిపి లింగ వివక్ష చర్యలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందుకోసం ఐసిడిఎస్, ఎన్‌జిఒల సహాయం తీసుకుంటున్నారు. బాపట్ల జిల్లా లో 5 సంవత్సరాల లోపు ఉన్న స్త్రీ, పురుష నిష్పత్తులను పరిశీలిస్తే ప్రతి 1000 మంది బాలురకు 913 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. స్త్రీ, పురుష నిష్పత్తిని సమానం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

బాలికలకు అనీమియా పరీక్షలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా గర్భిణులు, 02 నుంచి 19 ఏళ్ల బాలికలకు అనీమియా పరీక్షలను నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు అందిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్, విలేజ్ హెల్త్ క్లినిక్స్ ద్వారా జిల్లాలోని 25 మండలాల్లో పిల్లల నుంచి వద్ధుల వరకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఉచితంగా ఇచ్చే చర్యలు తీసుకున్నారు.

కరోనా నివారణకు ముందస్తు చర్యలు

కరోనా వైరస్ వ్యాధి తిరిగి కొన్ని దేశాల్లో ప్రబలుతున్నట్లు, మన దేశంలో అక్కడక్కడా కొన్ని కేసులు వస్తున్నట్లు వెల్లడవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా లో కూడా కరోనా నిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి తెచ్చారు.రోజు అవసరాన్ని బట్టి 30 నుంచి 40 టెస్టులు చేస్తున్నారు. బాపట్ల, చీరాల, రేపల్లె వైద్యశాలల్లో బెడ్లు, ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులోకి ఉంచారు. జిల్లా కేంద్రంలో వైద్యుల సంఖ్యను పెంచనున్నారు.

అసమానతలు తొలిగితేనే సమ సమాజం

డాక్టర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సమాజంలోని రుగ్మతలు, అసమానతలు తొలగినప్పుడే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని వెంకట రమణ నర్సింగ్ హోం వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) 2023 జిల్లా కేలండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నేడు కెవిపిఎస్ లాంటి సంస్థలు సమాజంలోని అంతరాలు తొలగించేందుకు ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సంస్థను మరింతగా ముందుకు తీసుకుని వెళ్లాలని కోరారు. రాఘవేంద్ర శ్రీనివాస హస్పిటల్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న కెవిపిఎస్‌కు అభినందనలు తెలిపారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రఘురామ్ మాట్లాడుతూ అనేక మంది త్యాగధనుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి,

కెవిపిఎస్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

అంతరాలు రూపుమాపేందుకు కెవిపిఎస్ ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే ఉందన్నారు. రాబోయే రోజుల్లో సామాజిక పోరాటాలను మరింతగా నడిపేందుకు ప్రతిన బూనా లన్నారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరించి మొదటి కాపీని డాక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదగా జాల అంజయ్య, డాక్టర్ శ్రీనివాస్ నుంచి టీకటి శ్రీనివాసరావు, యుకె ఇన్సూరెన్స్, ఫైనాన్షియల్ సర్వీస్ కన్సల్టెన్సీ బి.వెంకట్రావు నుంచి జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు అందుకున్నారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లాఉపాధ్యక్షుడు వి. మోజేష్, టి.రామారావు ఎ. శ్రీనివాసరావు, కాలే మల్లికార్జునరావు, జజ్జర సంజీవరావు, బక్క జేసురత్నం,జిల్లా కమిటీ సభ్యులు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సాయి శ్రీనివాస్‌కు సత్కారం

ప్రజాశక్తి-మార్కాపురం

ఎయిమ్స్‌లో జాయితీ స్థాయిలో 2వ ర్యాంకు సాధించిన మార్కా పురం పట్టణానికి చెందిన డాక్టర్ గుర్రం మోహన్‌రావు కుమారుడు గుర్రం సాయి శ్రీనివాస్‌ను ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ర్యాంకర్ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల సహకారంతో ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు, షటిల్ సభ్యులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

సత్కారం అందుకుంటున్న సాయి శ్రీనివాస్